ప్రజాశక్తి

గురువారం 9 అక్టోబర్ 2025 5

శ్రీ సత్యసాయి



పిఎం ధన్‌ధ్యాన్ కృషి యోజన

అమలుకు చర్యలు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



వీడియో కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పీఎం ధన్ ధ్యాన్ కృషి యోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పథకం నిర్వహణపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధన్ ధ్యాన్ యువజన సమితులను గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎంత వ్యవసాయ భూమి ఉంది.. ఎంత పంటను పండిస్తున్నారు.. ఎంత ఉత్పాదకత వస్తోంది.. అన్న వివరాలను నివేదిక ద్వారా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పంట ఉత్పత్తులు పెరగడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వనరులు, సంరక్షణ పనులు చేపట్టి భూగర్భ జలాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాము నాయక్, సిపిఒ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, నైపుణ్య అభివృద్ధి అధికారి హరికృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

జిల్లాలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్, తల్లికి వందనం, పీఎం సూర్య ఘర్, వ్యవసాయం, రెవెన్యూపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఇందులో పాల్గొన్నారు. ఈనెల 11న అంతర్జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమం నిర్వహించాలన్నారు. తరచూ వసతి గృహాలను సందర్శించి శానిటేషన్, భోజన ఏర్పాట్లు, మరుగుదొడ్లు, వంటగది, నీటి వసతి తదితర అంశాలను పరిశీలించాలన్నారు. తల్లికి వందనం కింద జిల్లాలో 1719 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, వ్యవసాయ అధికారి రాము నాయక్, ఐసిడిఎస్ పీడీ ప్రమీల, సిపిఒ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై

దాడిని ఖండిద్దాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగపై జరిగిన దాడిగా భావించి ప్రజలందరూ దీనిని ఖండించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గవాయిపై మతోన్మాదుల దాడికి నిరసనగా బుధవారం గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్‌పై మతోన్మాద అడ్వకేట్ కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరటం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందన్నారు. మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ఇప్పటి వరకు ధ్వంసం చేస్తూ వచ్చారని, ఇప్పుడు బహిరంగంగా సనాతనధర్మం పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు న్యాయమూర్తిపైనే చెప్పు విసరటం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానం అన్నారు. ఇదే సనాతన ధర్మం అని ప్రధానమంత్రి భావిస్తున్నారా.? లేదా అన్నదానిపై మోడీ ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కళ్యాణ్ ఈ దాడిని దీన్ని బలపరుస్తారా.? వ్యతిరేకిస్తారా.? అన్నది కూడా చెప్పాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్రకుమార్, వి.రామిరెడ్డి, కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, సావిత్రి, కృష్ణమూర్తి, బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు పరమేష్, ఆర్.వినాయుడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి ఇలాఖాలో ఆయకట్టుకు అనుమతులు

హంద్రీనీవాపై రెండు లిఫ్ట్‌లు
మిడ్‌పెన్నార్ మరమ్మతులకు నిధులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆర్థిక శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకానికి అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే వీటికి ఆమోదం లభించింది. ఇందుకు సంబంధించి ఇప్పుడు అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆయకట్టుకు అనుమతులు

ఉరవకొండ నియోజకవర్గంలోని ఆమిద్యాల లిఫ్ట్‌కు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హంద్రీనీవా ప్రధాన కాలువ 203 కిలోమీటరు వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా 109 క్యూసెక్కుల నీటిని ఆమిద్యాల, రాకెట్ల, పెద్దకౌకుంట్ల గ్రామాల పరిధిలోని ఎనిమిది వేల క్యూసెక్కుల నీటిని అందించే లక్ష్యంతో దీనికి అనుమతులిచ్చారు. అదే విధంగా హంద్రీనీవా రెండవ దశలో 52ఎ ఆయకట్టును స్థిరీకరించాలని అందులో పేర్కొన్నారు. దీని కోసం రూ.72.30 కోట్లు కేటాయించారు. ఇక వజ్రకరూరు మండలం రాగులపాడు లిఫ్టు వద్ద నుంచి కూడా మరో ఎత్తిపోతల పథకానికి అనుతులిచ్చారు. వజ్రకరూరు, ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లోని 107 కిలోమీటరు వద్ద నుంచి వంద క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల ద్వారా నీటిని అందించేందుకు అనుమతిలిచ్చారు. దీనికి రూ.55.60 కోట్లు కేటాయించారు. దీని ద్వారా పది వేల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలన్నది లక్ష్యం.

మిడ్‌పెన్నార్‌కు మరమ్మతులు

మిడ్ పెన్నార్ డ్యామ్ మరమ్మతులకు ఐదు కోట్లు మంజూరు చేశారు. రబ్బరు సీళ్ల మార్పుతోపాటు, వాక్‌వే బ్రిడ్జి, క్రస్టగేట్ల మరమ్మతులు, కంట్రోల్‌ప్యానల్ మరమ్మతులతోపాటు, డ్యామ్ పరిసరాల్లో సుందీకరణకు రూ.5.20 కోట్లు కేటాయిస్తూ ఉత్వర్వులిచ్చారు.

సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థి దశ నుండే సేవాభావాలను అలవర్చుకోవాలని బిట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం బిట్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ చంద్రమోహన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం పట్టణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. హిందూపురం పట్టణంలోని రూపశ్రీ వృద్ధాశ్రమం, శ్రీ వెంకటేశ్వర వృద్ధాశ్రమం, నిర్మలా వృద్ధాశ్రమంలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు అవసరమైన వస్తువులు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఐద్వా చైతన్య సాంస్కృతిక జాతాను ప్రారంభిస్తున్న డా॥పల్లవి

నేటి నుంచి అనంతలో ఐద్వా చైతన్య సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రచార జాతాను ప్రారంభించిన డా॥పల్లవి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నుంచి కళా చైతన్య సాంస్కృతిక ప్రదర్శనలు అనంతపురంలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రచార జాతాను బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ పల్లవి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కార్యదర్శి చంద్రిక మాట్లాడుతూ ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 13, 14, 15వ తేదీల్లో అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కృష్ణ కళామందిరిలో మహిళల సమస్యలపై వివిధ రూపాల్లో ఉన్న ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి డాక్టర్ బి.అరుణ, డాక్టర్ ఎం.ప్రగతి హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌కు ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు రామాంజినమ్మ, నగర కార్యదర్శి అశ్విని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరి, ఓతురు పరమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించండి

సమీక్ష సమావేశంలో మంత్రి సవిత



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - పెనుకొండ

ప్రజలు సంతృప్తి చెందేలా పారదర్శకతకు అమలు చేయాలని, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో పెనుకొండ మున్సిపాలిటీ, సోమందేపల్లి, పరిగి మండల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మండలాల వారిగా ఇప్పటి వరకు పూర్తి అయిన పనుల వివరాలు, అలాగే కొనసాగిస్తున్న పనుల పురోగతి నివేదికను మంత్రికి వివరించారు. ప్రధానమైన విధ్యుత్,రెవెన్యూ, హౌసింగ్,శానిటేషన్, రక్షిత మంచినీరు, ప్రజారోగ్యం తో పాటు అత్యవసర సేవలు పట్ల యుద్ధప్రాతిపదికన స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులు, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతికి ఉపయోగం : జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని, ధరల తగ్గులపై ప్రజలు ఆనందంగా ఉన్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్ర ఖజానాపై రూ.8 వేల కోట్ల మేర భారం పడినా పేదలకు మేలు కలుగుతోందన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు సంస్కరణలను స్వాగతించారన్నారు. బుధవారం పట్టణంలోని వజ్రాలపేట నుంచి నారాయణమ్మ కాలనీ వరకూ జీఎస్టీ 2.0 సంస్కరణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలను మంత్రి సందర్శించారు. నిత్యావసర, ఇతర వస్తువుల ధరల తగ్గుదలపై వినియోగదారులతోనూ ముచ్చటించారు. జీఎస్టీ తగ్గుదలపై మంత్రి సవిత అవగాహన కల్పించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. నిత్యావసరాలు, ఇన్స్యూరెన్స్, మెడికల్, దుస్తులు వంటి ప్రధాన వస్తువులపై జీఎస్టీ తగ్గడం వల్ల ఆర్థికంగా ఎంతో లబ్ధి కలుగుతోందన్నారు. రూ.5 వేల విలువ చేసే నిత్యావసరాలపై రూ.1200ల వరకూ ధరలు తగ్గాయన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో రాష్ట్ర ఖజానాపై రూ.8 వేల కోట్లు భారం పడుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి జోడు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయని మంత్రి తెలిపారు. పెనుకొండ పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మాజీ సర్పంచి సూర్యనారాయణ, రఘువీరా చౌదరి, బాబుల్ రెడ్డి, త్రివేంద్ర నాయుడు, షౌకత్. కౌన్సిలర్లు గిరి, గీతా హనుమంతు, ఎనుముల రామకష్ణ, అగండి రామాంజనేయులు, వడ్డే చంద్ర, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌కు ఆహ్వానం : స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ కల్చలర్ మీట్ కు మంత్రి సవితను రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆహ్వానించారు. బుధవారం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంత్రి సవితను రెవిన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రితో మాట్లాడుతూ..నవంబర్ 7 నుంచి 9 తేదీ వరకు అనంతపురంలోని ఆర్ డిటి స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ కల్చలర్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. వాటికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనందరావు, తహాశీల్దార్ స్వాతి, సిఎస్‌డిటి ప్రభావతి, రెవిన్యూ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - మడకశిర రూరల్



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సుప్రీం కోర్టు న్యాయమూర్తి పై జరిగిన దాడికి నిరసనగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు విధులను బహిష్కరిస్తున్నట్లు మడకశిర న్యాయవాదుల సంఘం నాయకులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమూర్తి పై జరిగిన దాడిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకశిర న్యాయవాదుల సంఘం అధ్యక్షులు అశ్వర్థ నారాయణ, కార్యదర్శి ఉమేష్ చంద్ర, సీనియర్ న్యాయవాదులు గోవిందరాజులు, కరియన్న, క్రిష్టప్ప, హనుమంతరాయప్ప, రాజన్న, త్రిలోక్, గోపీనాథ్, కృష్ణమూర్తి, నాగేంద్ర, సురేష్ రాజు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో బుక్కపట్నం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - బుక్కపట్నం



ప్రతిభా విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెయిట్ లిఫ్టింగ్‌లో బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల చెందిన పదవ తరగతి విద్యార్థి సోమశేఖర్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించాడు. ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన 65 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించి, రాష్ట్రస్థాయిలో మంగళగిరిలో జరిగే వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభా విద్యార్థిని ప్రధాన ఉపాధ్యాయుడు జగదీష్, పిడి రామకృష్ణ ఉపాధ్యాయులు అభినందించారు.

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

జీఎస్టీ పన్నుల తగ్గింపుపై పట్టణంలోని ఎన్ఎస్ పి యర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, స్టేట్ టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతు జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం జీఎస్టీపై అవగాహన కల్పించిన డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌ను కామర్స్ విభాగం తరఫున కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కళాశాల వాణిజ్య విభాగం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటేసులు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఇ. శ్రీధర్, కామర్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు యస్.బాలరెడ్డి, జి. గోపాల్, యు.సంజీవరాయ, కేజే నందిని, సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌళూరు రామకృష్ణా రెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - హిందూపురం రూరల్

హిందూపురం రూరల్ పరిధిలోని చౌలూరు గ్రామంలో బుధవారం వైసిపి మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి మూడవ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజక వర్గం వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరై ఆయనకు ఘననివాళులు అర్పించారు. మొదటిగా చౌళూరు రామక్రిష్ణ రెడ్డి కుటుంబ సభ్యులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చౌళూరు రామక్రిష్ణా రెడ్డి కుటుంబ సభ్యులు నారాయణమ్మ, మధుమతి రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు, చౌళూరు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి



సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెడికల్ కళాశాలల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్యం కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల పి-3 విధానాన్ని వ్యతిరేకిస్తు రాజకీయ పార్టీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయ ఆవరణంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో దాదాపు మూడు వేల మంది విద్యార్థులు, ప్రజలు సంతకాలు చేశారు. ఈసందర్భంగా అబ్దుల్ ఘనీ, నాయకులు శ్రీనివాసులు, శ్యామ్ కిరణ్ మాట్లాడుతు దేశంలో ఎక్కడ లేని విధంగా వైద్య విద్యను పిపిపి పద్ధతిలో నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. విలువైన ప్రజాధనాన్ని ప్రైవేట్ వారికి అతి చౌకగా కట్టబెట్టే పిపిపి విధానం వైద్యరంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించడంలో భాగమని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం దారుణమని అన్నారు. కూటమి ప్రభుత్వం పిపిపి విధానానికి కొత్త భాష్యం చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీల భవనాల నిర్మాణాలను కొంత వరకు పూర్తి చేసిందని, వాటిని చూపకుండా ఖాళీ స్థలాలను చూపిస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్‌పరం చేయాలనుకున్న కళాశాలలు 30 నుంచి 50శాతం నిర్మాణం పూర్తయ్యాయని వివరించారు. ప్రజా ధనంతో సేకరించిన స్థలాలను, నిర్మాణాలను కారుచౌకగా ప్రైవేట్ వారికి అప్పగించే ఈ విధానం ప్రభుత్వ సొమ్మును పెట్టుబడిదారుల పరం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60, 40 శాతం వాటాతో నిర్మించిన ఈ భవనాలను ప్రైవేట్ వారికి 60 ఏళ్లకు లీజుకు ఇవ్వాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఉండాలన్నారు. సంపద సష్టిస్తానని నినాదంతో ముందుకొచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రభుత్వ, ప్రజల సంపదను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. ఇలా అయితే డబ్బు ఉంటేనే చదువుకునే పరిస్థితి ఉంటుందన్నారు. పిపిపి విధానానికి వ్యతిరకంగా ప్రజలు, విద్యార్థులు, యువత ముందుకొచ్చి పెద్ద ఎత్తున ఎక్కడిక్కడ ప్రజా ఉద్యమం చేపట్టి ప్రజల ఆస్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎంకార్యదర్శి మున్నా, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, జై భారత్ భీమ్ రావు పార్టీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరు నాగరాజ్, ఏపీ ఆర్ ఎస్ కార్యదర్శి కోడుమూరు నౌషాద్, సమాజవాది పార్టీ తౌసిఫ్, ఆల్ ఇండియా బి ఎస్ పి పార్టీ జిల్లా అధ్యక్షులు హరికుమార్, ఆర్ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊట్కూర్ నరసింహమూర్తి, నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం నరసింహమూర్తి, కాంగ్రెస్ పార్టీ జియా తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి మున్సిపాలిటీలో 34వ వార్డు వికలాంగుల కాలనీ (బర్ధన్ కాలనీ)లో సిసి రోడ్లు మరియు మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి కదిరప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు కాలనీ వాసులుతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కదిరప్ప మాట్లాడుతూ కదిరి మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డు బర్ధన్ వికలాంగుల కాలనీలో ప్రభుత్వం సుమారు 90 మందికి గృహ నివాస స్థలాలు మంజూరు చేసిందన్నారు. దీంతో వారు అక్కడ ఇళ్లు కూడా నిర్మించుకొన్నారని ఈ కాలనీలో నేటికి సిసి రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, మధు నాయక్, పవన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

ఆంజనేయులుకు ఆత్మీయ సన్మానం



ఆంజనేయులను సన్మానిస్తున్న బాలకొండయ్య

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రికార్డు అసిస్టెంట్ ఆంజనేయులు సేవలు మరవలేనివని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య తెలిపారు. బుధవారం నగరంలోని రైతుబజార్ వద్దనున్న జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ గాప నిచేస్తున్న ఆంజనేయులు, జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొంది శ్రీసత్యసాయి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను అనంత డిఐపిఆర్‌ఓ కార్యాలయ సిబ్బంది ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఏపీఆతో ఫక్రుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ ప్రభావతి, జూనియర్ అసిస్టెంట్ చాంద్ బాషా, టైపిస్ట్ సుహాసిని, టెక్నీషియన్ కమల్, కాసిం రాజారావు, తాజుద్దీన్, నజీర్, రామాంజనేయులు పాల్గొన్నారు.



ఎంఇఒ గంగప్పను సన్మానిస్తున్న దృశ్యం

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండల విద్యాశాఖ అధికారి గంగప్పకు తెలుగు మాధురి, గుర్రం జాషువా అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి -2 ప్రసన్న లక్ష్మీ ఆధ్వర్యంలో గంగప్పను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తౌసిఫ్అలీ ఖాన్, నందిని, లక్ష్మణ్, ప్రవీణ్, రాజశేఖర్, రేణుక, ఫైరోజా, ముస్తఫా, లక్ష్మీనరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

గ్రంథాలయంలో పాఠకుల సభ్యతం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లోని ప్రధాన పౌర శాఖ గ్రంథాలయమును తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా పాఠకులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ, గ్రంథాలయ అభివృద్ధికి గ్రంథాలయ సిబ్బంది తప్పనిసరిగా తోడ్పాటు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది రమణా నాయక్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎపిజిబి సేవలు నిలిపివేత

ప్రజాశక్తి - ముదిగుబ్బ

బ్యాంకుల విలీనం కారణంగా అనంత గ్రామీణ బ్యాంకు సేవలు నాలుగు రోజులు నిలిపివేస్తున్నట్లు ఆ బ్యాంకు ముదిగుబ్బ బ్రాంచి మేనేజర్ అజయ్ సింహ రెడ్డి, రీజినల్ మేనేజర్ నిత్య కుమార్ తెలిపారు. ఖాతా దారులు సహకరించాలని ఆయన కోరారు. గురువారం నుంచి సోమవారం ఉదయం 10 గంటల లోపు విలీనం ప్రక్రియ పూర్తి అవుతుందని తెలిపారు.. ఆ తర్వాత బ్రాంచ్ లో ఉన్న ఖాతా దారుల అకౌంట్ బుక్కుల స్థానం లో ఎటువంటి రుసుము లేకుండా పాస్ బుక్కు ఇవ్వడం జరుగుతుందన్నారు.

'శ్రీరాములుతో సిపిఎంకు సంబంధం లేదు'

ప్రజాశక్తి ఓబులదేవరచెరువు

ఐఎఫ్‌టియు కార్మిక సంఘంలోకి చేరిన శ్రీరాములు అనే వ్యక్తికి తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని సిపిఎం స్థానిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం మాట్లాడుతూ శ్రీరాములను ఐఎఫ్‌టియులో చేర్చుకున్నట్లు ప్రకటనలో చూశామని అయితే ఆ జిల్లా కార్యదర్శి ఏమీ తెలుసుకోకుండా తమ పార్టీ నుంచి చేర్చుకున్నట్లు ప్రకటన ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్లు నాయకులు వివి రమణ, కుళ్లాయప్ప పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహప్రతిష్టాపన

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని కమ్మువారిపల్లిలో శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు వాల్మీకి పవన్ కుమార్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ దాదెం వెంకట శివారెడ్డి, మాజీ ఎంపీపీ శ్యామలమ్మ, ఎల్‌ఐసి నారాయణరెడ్డి, ఎన్నార్సైలు. దాదెం మధుసూదన్ రెడ్డి, దాదేం భయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని గాంధీ సర్కిల్ లో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి దాతలు రూ.2,01,116లు విరాళం అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు పట్టణానికి చెందిన రమణ, శీలా దంపతుల కుమారుడు డాక్టర్ నిహాల్ ఆలయ కమిటీ ప్రతినిధులకు శాశ్వత సభ్యత్వం కింద విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, నిమ్మకాయల రాము, అమర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా అనధికార లేఅవుట్లు



మండలంలో వేసిన లే అవుట్

ప్రజాశక్తి - పరిగి

మధ్యతరగతి కుటుంబీకుడు తాను భవిష్యత్తు తరాల కోసం అరకొర ప్రైవేట్ లేఔట్లలో తీసుకున్న ఇంటి స్థలాలకు ప్రస్తుత పరిస్థితుల్లో భరోసా కరువవుతుంది.పరిగి మండల వ్యాప్తంగా వినియోగదారుడికి పూర్తిస్థాయి భరోసా కల్పించాల్సిన లేఔట్ యాజమాన్యం అక్రమ మార్గంలో లేఅవుట్లో వేస్తూ సొమ్ము చేసుకుంటోంది. ఇలాంటి మోసాలకు చరమగీతం పాడాలని ఉద్దేశంతో ఇటీవల ప్రభుత్వం కొన్ని మండలాలను ఎంచుకొని ఈ మండలాల పరిధిలో వేసే లే అవుట్లకు తప్పనిసరిగా అహుడా పరిధిలో మాత్రమే అనుమతి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఏ లేఅవుట్ అయినప్పటికీ అహుడా పరిధికి వస్తే సెక్రటరీల పనితీరు నామమాత్రం కావడంతో పరిగి మండలంలోని కొన్ని పంచాయతీ పరిధిలో వేస్తున్న అక్రమ లేఔట్‌లకు సెక్రటరీలే అన్ని తామై పనిచేస్తుండటం విమర్శలకు దారితీస్తుంది.మండలంలోని ఎర్రగుంట పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 97 లో గత 15 రోజుల ముందే ఎలాంటి అనుమతులు లేకుండానే రాళ్లు వేసి యదేచ్ఛగా విక్రయాలు చేస్తుంటే తమకు ఎందుకులే అన్నట్లు అక్కడ పనిచేస్తున్న సెక్రటరీలు వ్యవహరిస్తుండటం చూస్తే అహుడా వీరికి కనిపించదా అన్న అనుమానాలు చోటు చేసుకోక తప్పదు. గతంలో భూ యజమానికి నోటీస్ ఇవ్వడం మాత్రమే కాకుండా ఈ లే అవుట్‌పై ముందు ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి . ఈ విషయాలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు కూడా సెక్రెటరీకే వత్తాసు పలకడం పై మండలంలో అహుడా పరిస్థితి ఏంటి అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే ప్రతి లేఅవుట్ అహుడా పరిధికి తీసుకువచ్చి ఎల్ పి ఎస్, ఎల్ పి ఎన్ లను తప్పనిసరిగా అమలు పరచాలని అధికారులు చూస్తున్నప్పటికీ ఇవి క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యథేచ్ఛగా మట్టి అమ్మకాలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులో రోడ్డు విస్తరణ కార్యక్రమానికి ప్రభుత్వం ఇటీవల రెండు కోట్ల రూపాయలను నిధులను మంజూరు చేయడంతో. ఈ పనులను కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నారు ధర్మవరం రోడ్డు మాజీ మేయర్ బిల్డింగ్ వద్ద నుండి పుట్టపర్తి రోడ్డు లోని సందీప్ సినిమా హాల్ వరకు ఒక కిలోమీటర్ రోడ్డుకు ఇరువైపులా మట్టిని తొలగించి నూతన రోడ్డును నిర్మించాల్సి ఉంది అయితే అక్కడ ఉన్న మట్టిని కాంట్రాక్టర్ టిప్పర్లతో ప్రైవేటు వ్యక్తులకు ఒక టిప్పర్ మట్టి రూ. 2 వేల నుండి 3 వేల రూపాయల వరకు అమ్ముకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ మట్టిని ప్రభుత్వ కార్యాలయం వద్ద, పాఠశాలల వద్ద, ప్రభుత్వ కాలనీలలో, అక్కడ ఉపయోగించాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్ మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా పబ్లిక్ గా మట్టిని విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మట్టి అమ్మకాల గురించి ఆర్‌అండ్‌బి జెఈ వన్నూరు స్వామిని వివరణ కోరగా మట్టిని కాంట్రాక్టర్ ఎక్కడికైనా తరలించుకోవచ్చని అన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం



స్టడీ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ఐదు రోజులుగా బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న 2025 డిఎస్సీ నూతన ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను యుసిఇఆర్ టి రాష్ట్ర పరిశీలకులు వాగోలు వెంకటేశ్వర్లు , మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, భారత్ విద్యా సొసైటీ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతికి వెళ్లి నూతన ఉపాధ్యాయులతో ముఖాముఖిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యాభివద్ధికి అంకిత భావంతో సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఈశ్వర్ రెడ్డి, నాగవేణి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల పోలీస్ స్టేషన్లో సిబ్బంది కొరత



పోలీసుస్టేషన్ బోర్డు

ప్రజాశక్తి - తలుపుల

తలుపుల పోలీసుస్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. సంవత్సరాలు గడుస్తున్న పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించకపోవడంతో గ్రామీణ ప్రాంతాలలో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇటీవల మండల కేంద్రమైన తలుపుల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బద్దలు కొట్టి అందులోనే కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. ప్రతి పోలీస్ స్టేషన్ లోను ఎస్ఐతో పాటు ఇద్దరు ఎఎస్ఐలు, నలుగురు జమేదార్లు, 15 మంది కానిస్టేబుళ్లు ఉండాలి. అయితే తలుపుల పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు జమేదార్లు, ఆరుగురు పోలీసులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కోర్టు విధులకు ఒకరు, స్టేషన్లో కంప్యూటర్ విధులకు ఒకరు, సిఐ ఆఫీస్ కు ఒకరిని అటాచ్ చేయగా డీఎస్పీ ఆఫీస్ కు మరి ఒకరిని అటాచ్ చేయడంతో మిగిలిన ఇద్దరు కానిస్టేబుళ్లు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలూ నేరాలను వారిద్దరు ఎలా అరికట్టగలరని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మండలంలో శాంతిభద్రతలు కాపాడటానికి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని మండలవాసులు కోరుతున్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పెనుకొండ

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయప్ప అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం, అటవీ శాఖ సంయుక్తంగా 73వ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మానవ మనుగడ సాగించాలంటే ప్రకృతిలోని ప్రతి జీవిని సంరక్షించుకొని జీవ వైవిధ్య సమతుల్యతను కాడాలని తెలిపారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ గౌతమి మాట్లాడుతూ వన్య ప్రాణుల యొక్క ప్రాముఖ్యత,మనుగడ, వాటి సంరక్షణలో మానవుని యొక్క పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ యశోద రాణి, జంతు శాస్త్ర అధ్యాపకులు హరీష్ బాబు, తెలుగు అధ్యాపకులు రామన్న , విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జయప్ప



డిజైనర్ నాగరాజును సన్మానిస్తున్న జయశ్రీ, తదితరులు

డిజైనర్ నాగరాజుకు సన్మానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణానికి చెందిన డిజైనర్ నాగరాజ్ చేనేత డిజైన్ డెవలప్మెంట్‌లో జాతీయ అవార్డును ఇటీవల అందుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ తన స్వగృహంలో డిజైనర్ నాగరాజును బుధవారం ఘనంగా సన్మానించారు. అనంతరం జయశ్రీ మాట్లాడుతూ దేశ, రాష్ట్రస్థాయిలో డిజైనర్ నాగరాజు చేనేత వృత్తికి, పరిశ్రమకు మంచి గుర్తింపును తేవడం గర్వకారణమన్నారు. అనంతరం బీసీ సంక్షేమ నాయకులతో కలిసి సంకారపు జయశ్రీ డిజైనర్ నాగరాజును ఘనంగా సన్మానించారు.

మందుల ధరలు తగ్గాయి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిఎస్టి తగ్గించడంతో మందుల ధరలు తగ్గి సామాన్య , మధ్యతరగతి ఊరట చేకూరిందని శ్రీ సత్య సాయి జిల్లా వైద్యాధికారిని ఫిరోజాబేగం పేర్కొన్నారు. చౌకగా ఆరోగ్యం లభించడమే కాక ప్రతి వ్యక్తికి కుటుంబంలో బీమా సౌకర్యం కల్పించడం కోసం జీఎస్టీ భారీగా తగ్గించి ఊరట కల్పించిందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణ వలన మందులు ధరలే కాక ల్యాబ్ పరికరాలు ధరలు, ఆరోగ్య బీమా తీసుకోవడం సులభతరం కావడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీ స్థాయి నుండి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ కేంద్రాలు ఏరియా ఆసుపత్రి , జిల్లా ఆసుపత్రుల వరకు, ఈ విషయంపై ప్రజలకు తెలియచెప్పేందుకు సన్నాహాలు చేసి, ర్యాలీలు సమావేశాలు, నిర్వహించాలని, ఈ సమావేశాలకు జిల్లాస్థాయి అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందులో భాగంగా పుట్టపర్తి మండలంలో యనమలపల్లి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారం చేసిన పోక్సో కేసులో నిందితుడికి అనంతపురం పోక్సో స్పెషల్ కోర్టు 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 5,000 జరిమానా, బాధితురాలుకి రూ. 4.50వేల పరిహారం చెల్లించాలని బుధవారం తీర్పు ఇచ్చింది. 2020 సంవత్సరం డిసెంబర్ నెలలో నల్లమాడ మండలం ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలిక తన ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన బండి ఆదినారాయణ ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి జొరబడి అత్యాచారం చేశాడు. ఈ కేసులో నల్లమాడ పోలీస్ స్టేషన్ అధికారి కేసు నమోదు చేయగా అప్పటి కదిరి డీఎస్పీ విచారణ చేశారు. అనంతపురం జిల్లా పోక్సో కోర్టులో చార్జిషీటు వేయడం జరిగింది. ఈ కేసులో పూర్వాపరాలను పరిశీలించి సాక్షులను విచారించిన కోర్టు బండి ఆదినారాయణ నేరం చేశాడని నిర్ధారించింది. ఈ మేరకు బుధవారం తీర్పు ఇచ్చింది. నిందితుడికి 20సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించడంతోపాటు బాధితురాలికి రూ. 4.50లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పు వెల్లడించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని పొడరాళ్లపల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బుక్కపట్నం మండలం గశికవారి పల్లి గ్రామానికి చెందిన వడ్డే రమణ (42) ముదిగుబ్బ నుంచి సొంతగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళుతున్నాడు. ఆయన వాహనాన్ని పొడరాళ్లపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కింద పడి మహిళ...

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్



మహబూబ్ బీ (ఫైల్‌ఫొటో)

మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన మహబూబ్ బీ (60) అనే మహిళ లారీ కింద పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బుధవారం ఉదయం మహిళ బహిర్భూమికి వెళ్లి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఓ లారీ రివర్స్ వస్తున్న సమయంలో డ్రైవర్ చూసుకోకపోవటంతో మహబూబ్‌బీ లారీ వెనుక చక్రాల కింద పడింది. ఈ ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. మహిళకు వినికిడి లోపం ఉందనిలారీ వచ్చేది గమనించకపోవడంతో ఆమె ప్రమాదానికి గురైందని స్థానికులు తెలిపారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్



బంగారు గొలుసు పోయిందంటూ కన్నీటి పర్యవంతం అవుతున్న బాధితురాలు

ధర్మవరం పట్టణంలో ఆర్టీసీ బస్సులో ఒక మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు అనంతపురం నుండి ధర్మవరానికి వస్తున్న ఆర్టీసీ బస్సులో తన మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తుతెలియని దొంగ దొంగలించాడని బాధి తురాలు జమున తెలిపింది. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి తండాకు చెందిన రవి నాయక్ భార్య జమున బుధవారం ఉదయం తన కుమార్తెను కళాశాలకు వదిలి పెట్టేందుకు అనంతపురానికి వెళ్లింది.ఆ తర్వాత అనంతపురంలో ధర్మవరం ఆర్టీసీ బస్సు ఎక్కింది. తలనొప్పిగా ఉండటంతో టాబ్లెట్ వేసుకొని బస్సులో నిద్రపోయింది. ధర్మవరం బస్టాండ్‌కు రాగానే తన మెడలో చైను కనిపించకపోవడంతో లబోదిబోమంది. తన మెడలోని గొలుసు దొంగలించారని ఆర్టీసీ అధికారులకు తెలిపింది. అనంతరం ఆర్టీసీ అధికారులు చోరీ వివరాలను పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

వివిధ నేరాలకు పాల్పడిన పాత నేరస్తులకు పట్టణ సిఐ నారాయణరెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరస్తులను కదిరి తహసిల్దార్ మురళీకృష్ణ వద్ద బైండోవర్ చేశారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ కదిరి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని 20 మంది గతంలో గంజాయి, మట్కా, పేకాట, లాటరీ కేసుల్లో ఉండి పదే పదే వారి ప్రవర్తన మార్చుకోకవటంతో రౌడీ షీట్ నమోదు చేశామన్నారు. వారిని పోలీస్ స్టేషన్ కు పిలిపించి భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడకుండా తగిన కౌన్సిలింగ్ ఇచ్చి అనంతరం ఒక సంవత్సర కాలానికి 5 లక్షల రూపాయల పూచికత్తు తీసుకున్నట్లు చెప్పారు.

దెబ్బతిన్న సిటీ గ్యాస్ పైప్‌లైన్

ప్రజాశక్తి - హిందూపురం రూరల్

హిందూపురంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ సమీపంలో భారతీ ఎయిర్ టెల్ తరపున స్టైర్లైట్ టెక్నాలజీస్ లిమిటెడ్, క్వెస్ కార్ప్ లిమిటెడ్ తరపున ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేయడం కోసం అనధికారకంగా చేపట్టిన తవ్వకం పనుల సమయంలో థింక్ గ్యాస్ (గతంలో ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ) పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. థింక్ గ్యాస్లోని అత్యవసర ప్రతిస్పందన బృందం, ప్రభావిత విభాగాలను త్వరగా వేరుచేసి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించింది. బాధ్యులైన సంస్థపై అధికారికంగా పోలీసు ఫిర్యాదు చేసింది. అదే సమయంలో కాంట్రాక్టర్లు, పౌర పనుల ఏజెన్సీలు ఏవైనా తవ్వకం పనులు చేపట్టే ముందుగానే నగర మున్సిపల్ అధికారులకు లేదా సిజిడి కంపెనీకి ముందుగానే తెలియజేయాలని కంపెనీ కోరింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కదిరి టౌన్

వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్ర నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో కదిరి తూర్పు, పడమర సబ్ యూనిట్ ఆరోగ్య సహాయకులకు సబ్ యూనిట్ ఆఫీసర్లు దేవలా నాయక్, రామాంజనేయులు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేంద్ర నాయక్ మాట్లాడుతూ ఫీవర్ సర్వే, లార్వా సర్వే నాణ్యత ప్రమాణాలతో నిర్వహించాలని ప్రజలకు డ్రైడే యొక్క ఆవశ్యకత పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ, చికెన్ గునియా, డయేరియా లాంటి వ్యాధులను సత్వరం గుర్తించి యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు తీసుకోఆలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ సూపర్వైజర్లు మహబూబ్ బాషా, శశిధర్, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

మద్యంబాబులకు అడ్డాగా ప్రభుత్వ ఆసుపత్రి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్



ఆసుపత్రి ఆవరణంలో మద్యంప్రియుడు

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణం మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. ప్రతి రోజు రాత్రి పగలు తేడా లేకుండా మద్యం తాగే వ్యక్తులు ఇక్కడ ఉంటారని రోగులు, వారి అటెండర్లు వాపోతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం మద్యం మత్తులో ఒక వ్యక్తి ఆసుపత్రి మార్చురీకి వెళ్లే దారిలో పూటుగా మద్యం సేవించి వచ్చి పోయే ప్రజలు రోగులకు తీవ్ర ఇబ్బందులకి గురి చేసాడు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య కేంద్రం లో పరిస్థితి ఇలా ఉందంటే మిగిలిన చోట్ల ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలిద్దాం

ప్రజాశక్తి - రొద్దం


అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని రొద్దం ప్రభుత్వ హై స్కూల్ నందు అంగన్వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కిశోర్ వికాసంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అదేవిధంగా పాఠశాలలో ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేసినట్లు అంగన్వాడీ కార్యకర్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మినారాయణమ్మ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు ఆసిన, అరుణ, ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికలకు పిల్లల హక్కులు బాల్య వివాహాల నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 10న జరిగే అంతర్జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేయడం జరుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి, ఎంఇఒ జాన్ రెడ్డప్ప తెలిపారు.

పరిగి : మండలంలోని పరిగి ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ లలితమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు సైబర్ నేరాలు, సైబర్ భద్రత, బాల్య వివాహాల నివారణ చట్టం, పరిశుభ్రత, రక్తహీనత, పిల్లల హక్కులు,లింగ సమానత్వం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీదేవి,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృపాసత్యరాజ్ , మహిళా సంరక్షణ కార్యదర్శి అశ్విని, అంగన్వాడీ ఉపాధ్యాయులు లక్ష్మీనరసమ్మ, ఆదిలక్ష్మి, పద్మావతి, లలిత, అనిత, దేవిక తదితరులు పాల్గొన్నారు.



రొద్దంలో అవగాహన కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు



పరిగిలో ఫిర్యాదుల బాక్సును చూపుతున్న విద్యార్థులు

బుక్కపట్నం :పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ జయంతి, ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో విద్యార్థులకు, అంగన్వాడి టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక ఆహార విలువల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్ప లత, ఎంఈఓ గోపాల్ నాయక్, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ :అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కదిరి అర్బన్, రూరల్, తలుపుల, ఎన్‌పి కుంట మండలాలోని ఉన్నత పాఠశాలల్లో బాలబాలికలకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు 10వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు సిడిపిఒ రాధిక తెలిపారు.